కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 11 మార్చి 2026

## పన్నులు వసూలు చేయాలి



దువ్వూరు, మార్చి 10, ప్రభాతవార్త:
మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలిసి 100శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దువ్వూరు, గుడిపాడు, చింతకుంట గ్రామాల్లో ఇంటి పన్ను, కుళాయి పన్నులు వసూలు చేసేందుకు పంచా యతీ కార్యదర్శులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఇంటి పన్ను వసూలు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారని, ఆ ఆదేశాల మేరకు 100 పన్నులు వసూలు చేసే విధంగా చూస్తున్నామన్నారు. వసూలు కాకపోతే ఎందుకు వసూలు కాలేదో వివరణ ఇవ్వాలని కోరుతున్నారని అందువల్లనే పన్ను వసూళ్లపై దృష్టి పెట్టామన్నారు. దువ్వూరు మండలంలో 70 శాతం పన్నులు వసూలు చేశామని అన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులో 80 శాతం వరకు వసూలు అయినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను, కుళాయి పన్ను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఆర్డీవో శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిసిన రాయచోటి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

# మత సంప్రదాయాలను గౌరవిస్తూ.. పండుగలను జరుపుకోవాలి

## జిల్లా శాంతి కమిటీ సమావేశంలో జేసీ డా.నిధి మీనా

కడప,మార్చి 10 ప్రభాతవార్త.
భిన్నత్వంలో ఏకత్వం భారతదేశము యొక్క ప్రత్యేకత అని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు... జిల్లాలో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగల నిర్వహణపై జేసీ డా.నిధి మీనా అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాజంపేట సబ్ కలెక్టర్ భావన,జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, బద్వేలు, పులివెందుల ఆర్ డి ఓ లు చంద్రమోహన్,చిన్నయ్య, కడప మున్సిపల్ కమీషనర్ రాకేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... మత సంప్రదాయాలను గౌరవిస్తూ.. శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో.. భక్తి భావంతో రంజాన్, ఉగాది, శ్రీరామనవమి పండుగలను నిర్వహించుకునేలా.. జిల్లా శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని తెలిపారు. శాంతియుత,ఆనంద వాతావరణంలో, ఒకరి మతాచారాలను మరొకరు గౌరవించుకుంటూ భక్తి శ్రద్ధలతో రంజాన్, ఉగాది, శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించుకుకోవాలని.. శాంతి కమిటీ సంఘం సభ్యులను ఆదేశించారు. అందు కోసం... అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పండుగ ఏర్పాట్లు, ఉత్సవాలు సజావుగా జరిగేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి ప్రతీకగా.. అన్ని మతాల ప్రజల సహకారంతో.. మజీద్ లు, ఈద్గాలు,దేవాలయాల వద్ద ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా ప్రార్ధనలు, పూజలు జరిగేలా చూడాలన్నారు.పండుగ వేడుకల సమయంలో ఆలయాలు,మజీద్ ల అన్ని రకాల భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు.ఎక్కడైనా ఏవైనా సమస్యలు ఎదురైతే.. వెంటనే అధికారులకు, పోలీసు సిబ్బందికి సమాచార మివ్వాలన్నారు.అనవసరమైన విషయాలనుఅత్యుత్సాహంతో.. సోషల్ మీడియాలలో పోస్టు చేయడం వంటి చర్యలను అరికట్టేలా శాంతి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ విషయంలో పోలీసు శాఖ అప్రమత్తంగా వుండాలన్నారు. పోలీస్ శాఖ ఇచ్చే సూచనలను తప్పక పాటించాలన్నారు. రంజాన్,ఉగాది, శ్రీరామ నవమి పండుగ వేడుకలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భక్తి భావంతో జరుపుకునేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు,



శాంతిభద్రతలకు,మత సామరస్యానికి ఇబ్బంది కలగకుండాప్రార్ధనలు,పూజలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నియమ నిబంధనలను శాంతి కమిటీ సభ్యులు ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగ దినాల్లో నిరంతర నీటి సరఫరా,విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సంబందిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్లపై.. పలువురు శాంతి కమిటీ సభ్యుల అభిప్రాయాలను జేసీ స్వీకరించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.... ఉగాది పండుగ తో పాటు రంజాన్ శ్రీరామనవమి పండుగలు వరుస క్రమంలో ఉన్నందున ప్రజలందరూ మత సామరస్యాన్ని పాటిస్తూ వేడుకలు జరుపుకోవాలని అన్నారు.జిల్లాలో మసీదులు దర్గాల వద్ద శాంతియుత వాతావరణంలో ప్రార్థనలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మైనారిటీ శాఖ జిల్లా అధికారి హిదియతుల్లా,శాంతి కమిటీ సభ్యులు, పోలీసు శాఖ, వివిధ శాఖల అధికారులు, దేవాదాయ శాఖ,మైనారిటీ అధికారులు,పలువురు అలయ అర్చకులు,మోజమ్ లు తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి పాలనలోనే రెవెన్యూ శాఖ అస్థవ్యస్థం

రాళ్ళ కోసం రూ.750కోట్లు దుర్వినియోగం
రాష్ట్ర రవాణ, క్రీడాశాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి



మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :
వైసిపి పాలనలోనే రెవెన్యూ శాఖను అస్థ వ్యస్థం చేసి భూ సమస్యలను పెంచారని, భూముల సరిహద్దు రాళ్ళపై బొమ్మలు వేసుకొని రూ.750 కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని రాష్ట్ర రవాణ, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. రైతు భూమి కబ్జా అంశంపై మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తప్పుదారి పట్టించేలా ఉన్నాయన్నారు. వైసిపి పాలనలో రైతుల భూముల కబ్జా చేసిన ఘటనలు ఎన్నో వెలుగులోకి వచ్చాయన్నారు. మీ భూమి-మీ హక్కుపేరిట రైతు న్యాయం కోసం ముఖ్యమంత్రి స్వయంగా స్పందించి అధికారులనే స్పాట్‌గా పిలవడం బాధ్యతాయుతమైన చర్య అన్నారు. భూ ఆక్రమణ నిజమైతే నిందితులపై కఠినచర్యలు తీసుకొంటామన్నారు. ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేసిన సంస్కృతి కూటమి ప్రభుత్వానిది అన్నారు. రైతుల హక్కులను కాపాడడం కూటమి ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం అన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ రైతులకు పెద్ద ముప్పుగా మారిందన్నారు. ప్రజల భూములను కాపాడడానికి, రైతులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు.

### రాజంపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో

# టిడిపి విజయమే లక్ష్యం

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



రాజంపేట పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు

రాజంపేట, మార్చి10 ప్రభాతవార్త :
రాజంపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరేలా నాయకులంతా సమిష్టిగాపని చేయాలని రాజంపేట నియోజకవర్గం అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పిలుపునిచ్చారు. ఎన్నికలకు పక్కా ప్రణాళికతో ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులను కోరారు.మంగళవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో చమర్తి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ పలు సమస్యల గురించి పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలతో చర్చించి అనంతరం వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీకి గొప్ప నాయకులు,కార్యకర్తలు ఉన్నారని,వార్డు వార్డుకు వెళ్లి సమన్వయంతో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మున్సిపాలిటిపై టిడిపి జెండా ఎవరు వేయాలంటే ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని, నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.కార్యకర్తలకు అండగా ఉంటానని,వారికి మద్దతుగా ఉండేలా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జగన్ మోహన్ రాజు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్,రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్,పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్, దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ కౌన్సిలర్లు గుగ్గిళ్ళ చంద్రమోళి,పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మంద శ్రీనివాసులు,క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు,మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కరీమ్, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు నూగల రమేష్,వార్డు అధ్యక్షులు బూత్ కన్వీనర్లు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా వైవీయు కాన్వకేషన్ల నిర్వహణ

**ఈ నెల13న నిర్వహణ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ రాక**
**1,194 పీజీ పట్టభద్రులు, 11,664 మంది డిగ్రీ విద్యార్థులు ..**
**ప్రతిభావంతులకు 176 బంగారు పథకాలు, 70 మందికి పీహెచ్డీ అవార్డులు**
**పాత్రికేయుల సమావేశంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్**



వైవీయూ, మార్చి 10, ప్రభాతవార్త:
యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నాలుగు కాన్వోకేషన్లు ఒకేసారి ఈ నెల 13వ తేదీ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. విశ్వవిద్యాలయం 11వ (202021), 12వ (202122) 13వ (2022 23),14వ (202324) కాన్వకేషన్ల నిర్వహణకు కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం సిద్ధమైందన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ కడపలోని వైవియూ ఆధ్వర్యంలోని సి.పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కాన్వొకేషన్ లో 1,194 పీజీ పట్టభద్రులకు, డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రతిభావంతులకు 176 బంగారు పతకాలు, 70 మంది పరిశోధకులకు పీహెచ్డీ అవార్డులు అందజేస్తున్నామన్నారు. నాలుగేళ్లకు కలిపి మరో ఇద్దరు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్లు ఇవ్వనున్నామన్నారు. ఆ ఇద్దరి పేర్లు రాష్ట్ర గవర్నర్ గారి కార్యాలయం నుంచి ఆమోదం రాగానే వెల్లడిస్తామన్నారు. విద్యార్థుల పట్టాలు అందజేసే మహోన్నత కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారని తెలిపారు. ఈ కాన్వకేషన్లో ఇన్ ఆప్సెన్షియా కింద 11,664 మంది డిగ్రీ విద్యార్థులు డిగ్రీలను అందుకోనున్నారని వివరించారు. కాన్వకేషన్ విశ్వవిద్యాలయం వెలుపల నిర్వహించడానికి గల కారణాలను ఉప కులపతి వివరించారు.కాన్వకేషన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించడానికి అనువైన సమావేశ మందిరం లేదన్నారు. 20 ఏళ్ల విశ్వవిద్యాలయంలో వెయ్యి మంది కూర్చుని ఆడిటోరియం లేక, 300 మంది కూర్చునే సమావేశ మందిరాల్లోని సదస్సుల నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం నాలుగు కాన్వోకేషన్లను ఒకేసారి నిర్వహించి రావడం వల్ల విద్యార్థులు వారి తల్లిదండ్రుల సంఖ్య 2 వేలకు చేరుతుందన్నారు. వారందరి సౌకర్యార్థం ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో కాన్వోకేషన్ నిర్వహించాల్సి వచ్చిందన్నారు. దీనివల్ల విశ్వవిద్యాలయానికి ఆర్థికపరమైన వ్యయం తగ్గుతుందని చెప్పారు. విశ్వవిద్యాలయంలోని కాన్వకేషన్ కోర్ కమిటీ చర్చించి నిర్ణయించిందని తెలిపారు.అందరూ పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. అయితే వచ్చే ఏడాది విశ్వవిద్యాలయంలోనే కాన్వోకేషన్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు.అంతేకాకుండా విశ్వవిద్యాలయానికి శాశ్వతమైన సమావేశ మందిరం నిర్మించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని, దాతల సహకారాన్ని కూడా కోరనున్నామన్నారు. ఇది తన ప్రణాళికలో ఒక భాగం అన్నారు. విలేకరులు అడిగిన ప్రశ్నకు ఉపకులపతి సమాధానం ఇస్తూ విశ్వవిద్యాలయంలో అసంపూర్తి నిర్మాణాల కోసం నిధుల అవసరమని ప్రభుత్వానికి నివేదించామని, సానుకూలంగా స్పందన వచ్చిందని తెలిపారు. కాన్వోకేషన్ విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్. వి. కృష్ణారావు, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య పార్వతి, విశ్వవిద్యాలయ పబ్లిక్ రిలేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత, డాక్టర్ టి. సురేష్ బాబు పాల్గొన్నారు.

## కడప నగరపాలక సంస్థలో

# ఏసీబీ సోదాలు

ఏకకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు



కడప కార్పొరేషన్ మార్చి 10 ప్రభాతవార్త:
రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు నిర్వహిస్తుంది. బిల్డింగ్ పర్మిషన్ జారీలో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణలో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందడంతో పక్కా వ్యూహంతో ఏసిబి భారీ ఆపరేషన్ కు శ్రీకారం పెట్టింది క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు. ఏకకాలంలో శ్రీకాకుళం, విశాఖ, నెల్లూరు, ఒంగోలు, కడప, అనంతపురం, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ లో ఏసీబీ అధికారులు తనిఖీ చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతిపై ఆరా తీశారు. టౌన్ ప్లానింగ్ చేపట్టిన పనులపై ఫిర్యాదు రావడంతో అధికారులు తనిఖీ చేపట్టారు. అందులో బాగానే కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో రికార్డులను పరిశీలించారు. ఏసీబీ సీఐలు నాగరాజు సయ్యద్ హసన్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ సెక్షన్ లో శోధాలు ప్రారంభించారు. పలు రికార్డులను పరిశీలించారు సిబ్బందిని విచారించారు. పూర్తిస్థాయి వివరాలను సోదాలు ముగిసిన అనంతరం వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

## జీవనోపాధి కోసం వచ్చి మిగతాజీవుడయ్యాడు



తంబళ్లపల్లె మార్చి10 ప్రభాతవార్త :
ఒరిస్సా రాష్ట్రం నుండి జీవనోపాధి కోసం వచ్చిన ఓ యువకుడు బలవంతపు మృతి చెందిన విషాదకర సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై టి.అనిల్ కుమార్ వివరాల మేరకు ఒరిస్సా రాష్ట్రాం నాలాగట్ కు చెందిన మనోజ్ బిసాయి(30) నెలన్నర క్రితం జీవనోపాధి కోసం తంబళ్లపల్లెలోని ఓ వేరుసెనగ కాయల మిషన్లో కూలీగా పనికి కుదిరాడు. ఈ కోవలో అతడు పరసతోపు పంచాయతీ నాయనప్ప గారి పల్లెలో ఓ ఇంట్లో కాపురం ఉన్నాడు. సోమవారం రాత్రి తన ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందాడు. తలుపు ఎంతటికి తెరవకపోవడంతో స్థానిక ప్రజలు తంబళ్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తలుపు తెరిచి చూడగా మనోజ్ బిసాయి ఉరి వేసుకుని మృతి చెందాడు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విలేకరులకు తెలిపారు.

## కామ్రేడ్ ఆమనగంటి శ్రీరాములకు నివాళులర్పించిన ఎన్జీవోలు




ప్రొద్దుటూరు అర్బన్ మార్చి 10 ప్రభాత వార్త
మంగళవారం పొద్దుటూరు తాలూకా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో కామ్రేడ్ ఆమగంటి శ్రీరాములు 105వ జయంతి సందర్భంగా ఎన్జీ హోమ్ లో అధ్యక్షులు జె.రామసుబ్బయ్య మరియు ఈ ప్రమీల ఆధ్వర్యంలో వారికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మాట్లాడుతూ కామ్రేడ్ శ్రీరాములు వారి సేవలు అమూల్యమైనవి వారు ఉద్యోగుల పెన్నిధి ఉద్యోగులు ఈరోజు పొందుతున్న ఫలాలు వారు అందించినవేనని రాజకీయ వేత్తగా ఎదిగి ప్రజాసేవ అందించారన్నారు. అలాగే పూర్వపు ప్రెసిడెంట్ వెంకటస్వామిని అలాగే మరొక అతిథి నాగన్నని సన్మానించారు . ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఇ.ప్రమీల, కోశాధికారి సి.సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్ నాగార్జున, వరప్రసాద్, ఆర్గనైజేషన్ సెక్రటరీ ప్రభంజన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ నారాయణరాజు,మధుసూదన్ రెడ్డి, వుమెన్ వింగ్ ఛైర్మన్ అరుణదేవి, గంగాదేవి, కుసుమకుమారి,జాయింట్ సెక్రటరీ సుజాత, ఓంకార్ పెన్షనర్స్ అధ్యక్షుడు దస్తగిరి రెడ్డి, సెక్రటరీ వెంకటయ్య, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, దేవానందు, సుధాకర్ రామ్మోహన్,నారాయణ పాల్గొన్నారు.

### ఇక కడప కార్పొరేషన్‌కు

# కలెక్టరే ప్రత్యేక అధికారి

ఇక మున్సిపాలిటీలలో ప్రత్యేక అధికారుల పాలన
కడప కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్
ప్రొద్దుటూరుకు కడప జాయింట్ కలెక్టర్
మదనపల్లె అన్నమయ్యకు జిల్లా కలెక్టర్



రాజంపేట, మార్చి 10 ప్రభాతవార్త
రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్ లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పాలక వర్గ గడువు ముసిరి నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మంగళవారం జీవో ఆర్టి నెంబర్ 224 జారీ చేశారు. కడప అన్నమయ్య జిల్లాలోని మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల పరిపాలన కొనసాగుతుందని గెజిట్లో పేర్కొన్నారు. పురపాలికల వారిగా ప్రత్యేక అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి. కడప కార్పొరేషన్ కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రొద్దుటూరుకు కడప జాయింట్ కలెక్టర్ నిధి మీనా, పులివెందుల ఆర్డిఓ పులివెందుల, జమ్మలమడుగుకు ఆర్డిఓ జమ్మలమడుగు, బద్వేల్ ఆర్డిఓ బద్వేల్‌కు మైదుకూరుకు కడప ఆర్డిఓ, ఎర్రగుంట్ల, కమలాపురంకు ఆర్డీవో, మదనపల్లె జాయింట్ కలెక్టర్ అన్నమయ్య రాయచోటి రాజంపేట సబ్ కలెక్టర్.

## మిత్రుని వద్దకు వెళ్లి వస్తు కానరాని లోకాలకు



యర్రగుంట్ల మార్చి 10 ప్రభాతవార్త:యర్రగుంట్ల శాంతి నగర్ కు చెందిన మంజుల ప్రసాద్ (22) ముద్దనూరులోని తన మిత్రుని వద్దకు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో వస్తుండగా కానరాని లోకాలకు పయనమయ్యాడు. యర్రగుంట్ల ముద్దనూరు రోడ్డులో గల ఐసిఎల్ సిమెంట్ సమీపంలోని ప్లై ఓవర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి మంజుల వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యర్రగుంట్ల . సిఐ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు

## చిలంకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే



**యర్రగుంట్ల మార్చి 10, ప్రభాతవార్త:**
యర్రగుంట్ల మండల పరిధిలో గల చిలంకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశా డే సమావేశం మంగళవారం నిర్వహించారు.వైద్య సిబ్బంది సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యం, మాతృశిశు సంరక్షణ అంశాల పై విస్తృతంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారి గణేష్ కుమార్ రెడ్డి, డాక్టర్ సేచరిత మాట్లాడుతూ, ఆశా కార్య కర్తలు గర్భిణీ స్త్రీలు, శిశు ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని టీకాల ప్రాముఖ్యతను వివరించి, టీకాల అనంతరం ఏవైనా దుష్ప్రభావాలు ఎదురైతే తీసుకోవాల్సి న జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హైరిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందేలా చూడాలని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో లభించే సౌకర్యాలను అర్హులైన దంపతులకు వివరించాలని, గృహ ఆధారిత సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 14 సంవత్సరాలు నిండిన బాలికలకు గర్భాశయ ముఖద్వారం క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్ వేసుకునేలా వారి తల్లిదండ్రులకు వివరించాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగ మునిరెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పార్వతమ్మ, హెల్త్ సూపర్వైజర్ రవి, సుభద్రమ్మ, ఆరోగ్య కార్య కర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## గ్లకోమా వ్యాధిపై జాగ్రత్తలు అవసరం

### డాక్టర్ దివ్య



**మదనపల్లెక్రైమ్, మార్చి 10 ప్రభాతవార్త.**
నీటి చుక్కల వ్యాధి (గ్లకోమా) పట్ల జాగ్రత్తలు అవసరమని జిల్లా ఆస్పత్రి కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ దివ్య తెలిపారు. జాతీయ గ్లోకోమా వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలోని రోగులకు నీటి చుక్కల వ్యాధి వ్యాపి, నివారణ మార్గాలపై డాక్టర్ వివరించారు. ఈ వ్యాధి కంటి నరాలకు నష్టం కలిగించి, దృష్టిలోపానికి దారితీయవచ్చన్నారు, 40 ఏళ్ల పై బడ్డ వారిలో గ్లకోమా వ్యాధి వస్తుందన్నారు. గ్లోకోమో వ్యాధి వారసత్వంగా వచ్చే అవకాశం ఉందన్నారు. అలాంటి వారు కంటి పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెడిసిన్స్ ద్వారా కంటిలో నీటి ఒత్తిడిని తగ్గించవచ్చని, లేసర్ ట్రీట్మెంట్ వల్ల వ్యాధిని అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ఆప్తమాలజిస్ట్ ఆజాద్, అర్జున్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఆమనగంటి శ్రీరాములు 105వ జయంతి



**బద్వేల్ అర్బన్ మార్చి 10 ప్రభాతవార్త :**
ఏపీఎన్జీజీఓస్ బద్వేల్ తాలూకా కార్యాలయం నందు ఆమనగంటి శ్రీరాములు 105 జయంతి నీ పురస్కరించుకొని రాష్ట్ర అధ్యక్షులు అనపర్తి విద్యా సాగర్ మరియు ప్రధాన కార్యదర్శి జివి రమణ, కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం స్థానిక బద్వేల్ ఏపీ ఎన్జీవో హోం నందు ఘనంగా అభినందన సభ నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో బద్వేల్ అధ్యక్షులు టీ. నరసింహా రెడ్డి మాట్లాడుతూ ఆమనగంటి శ్రీరాములు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కు చేసిన సేవలను కొనియాడారు,ఈ కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు కత్తి బ్రహ్మయ్య మరియు కే. రామసుబ్బయ్య, ఎం. పిచ్చయ్యలను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వి.శివరామిరెడ్డి అసోసియేషన్ ప్రెసిడెంట్ సాదు వెంకటేశ్వర్లు ట్రెజరర్ కే. రమణయ్య వైస్ ప్రెసిడెంట్ బి. వెంగయ్య, ఎం వి రమణయ్య, ఎస్.సుబ్బారాయుడు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీ సౌమ్యనాథ స్వామి హుండీ లెక్కింపు



**నందలూరు, మార్చి 10 ప్రభాతవార్త :**
జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఉండిని మంగళవారం లెక్కించగా 1,98,200 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీని 30 రోజులకు సంబంధించి లెక్కించడం జరిగిందని అన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి మల్లికార్జున, భక్తులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు చేరిన పదవతరగతి పేపర్స్



**రామసముద్రం మార్చి 10 ప్రభాతవార్త**
ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో భాగంగాప్రశ్నా పత్రాలు మంగళవారం మండల పోలీస్ స్టేషన్ కు చేరుకున్నాయి. అన్నమయ్య జిల్లా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పరీక్షా పత్రాలను స్టేషన్ కు తరలించి భద్రపరిచారు. పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ఎస్సై ఉమా మహేశ్వర్ రెడ్డి పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలోనే వాటిని భద్రంగా ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండ జాగ్రత్తలు తీసుకున్నట్లు వెల్లడించారు.

## దివ్యాంగ చిన్నారులకు దుస్తులు పంపిణీ

**వేంపల్లె:మార్చి 10 ప్రభాతవార్త**
స్థానిక భవిత దివ్యాంగుల కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు రంజాన్ తోఫా కింద దాత సంఘమిత్ర అధ్యక్షుడు సిరాజుద్దీన్ దుస్తులు పంపిణీ చేశారు. మంగళవారం రానున్న రంజాన్ పండుగ సందర్భంగా దాత కుమారుడైన మహమ్మద్ రఫీ చేతుల మీదుగా దుస్తులను పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు వెంకట్రామిరెడ్డి, స్టాలిన్ ఐజాక్, ప్రముఖ వైద్యుడు డా.ఎస్ఎఫ్ బాషా, ఫిజియోథెరపి వైద్యుడు డా.ఆనంద్ లు హాజరై చిన్నారుల పట్ల అభినందించారు. అలాగే ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల ప్రేమ, ఆప్యాయత కలిగి దాతల సహకారం ఎనలేనిదన్నారు. ఎల్లవేళలా వీరి పట్ల సహాయ సహకారాలు అందించే విధంగా దాతలు ముందుకు రావాలని కోరారు. అంతేకాకుండా వైద్యులు డా.షాహీన్, చిన్నారులకు వేసవిదృష్ట్యా వాటర్ బాటిల్స్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్పీలు యశోద, సుజాత, సిజీవి సుజాత తదితరులు పాల్గొన్నారు.



## సంపద ఫుల్.. త్రాగే నీరు నిల్

**పీలేరు మార్చి 10 ప్రభాతవార్త :**



పీలేరు పట్టణంలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంతకు వేలాది మంది రైతులు, వ్యాపారులు, వినియోగదారులు హాజరవుతుంటారు. అయితే ప్రస్తుతం సంతలో పరిశుభ్రత పరిస్థితి ఆందోళన కలిగించే విధంగా మారింది. సంత ప్రాంగణం మొత్తం చెత్త, పండ్ల అవశేషాలు, కూరగాయల వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారు. సంతలో సరైన పరిశుభ్రత లేకపోవడం వల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు ఈగలు, దోమలు అధికంగా కనిపిస్తున్నాయి. దీనివల్ల అక్కడకు వచ్చే ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం త్రాగడానికి నీళ్లు కూడా అందించడం లేదని, గేట్ వసూళ్లు మాత్రం ముక్కు పిండి వాసులు చేస్తున్నారని వాపోయారు. ప్రతి వారం వేలాది మంది ప్రజలు మరియు రైతులు సంతకు వచ్చే నేపథ్యంలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు త్రాగడాని నీరుకూడ ఏర్పాటు చాలా అవసరం. అదేవిధంగా సంత ప్రాంగణంలో తగిన సంఖ్యలో చెత్త బుట్టలు లేకపోవడం, చెత్తను సమయానికి తొలగించకపోవడం వంటి సమస్యలు పరిస్థితిని మరింత దారుణంగా మారుస్తున్నాయి. రైతులు మరియు వ్యాపారులు కూడా సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై స్పందించిన అన్నమయ్య జిల్లా డివియంసి సభ్యులు బోడేషా వలి మాట్లాడుతూ, పీలేరు మంగళవారం సంతలో పరిశుభ్రతను మెరుగుపరచడానికి పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సంత ముగిసిన వెంటనే చెత్తను తొలగించడం, తగిన సంఖ్యలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయడం, శుభ్రత సిబ్బందిని నియమించడం వంటి చర్యలు తీసుకుంటే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన సూచించారు. పీలేరు పట్టణానికి వచ్చే ప్రజలు, రైతుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి మంగళవారం సంతను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని మరియు త్రాగడాని నీటి సౌకర్యం ఉంచాలని బోడేషా వలి కోరుతున్నారు.

## 18 న మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం

**చిన్నమండెం మార్చి 10 ప్రబాత వార్త:**
మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సభాభవనం లో ఈ నెల 18 వ తేదీన మండల అధ్యక్షురాలు సుదామాధురి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. ఈ సమావేశానికి యంపిటిసి సభ్యులు,సర్పంచులు,కో ఆప్షన్స్ సభ్యులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని తెలిపారు.

## అమనగంటి శ్రీరాములు చిరస్మరణీయులు



**కడప కార్పొరేషన్ మార్చి 10 ప్రభాతవార్త:**
సంఘం వ్యవస్థాపకుడు, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జిఈఎఫ్) వవ్యస్థాపకులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులుగా పనిచేసి ఉద్యోగుల హక్కులకోసం అమనగంటి శ్రీరాములు పోరాడారని ఏపీ ఎన్జీజీవో సంఘం అధ్యక్షులు బి. శ్రీనివాసులు గుర్తు చేశారు. అమనగంటి శ్రీరాములు 105 వ జయంతిని మంగళవారం కడప ఏపీ ఎన్జీజీవో హోమ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా అధ్యక్షులు శంకర్ రెడ్డి, మునేయ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి టీ. శ్రీనివాసులు, సహ అధ్యక్షులు టీ తిమ్మా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సి.సిద్ధయ్య, బాల పుల్లయ్య, లక్ష్మీదేవి, సంయుక్త కార్యదర్శి సుహాసిని కుమారి, యన్ రాజశేఖర్, పద్మనాభరావు, శ్రీనివాసులు సిటీ అధ్యక్షులు కే. చిన్నయ్య, కార్యదర్శి సాంబశివరావు, విమెన్ వింగ్ ఛైర్మెన్ బి. కృష్ణ కుమారి, కన్వీనర్ ఎన్. ఎం. కుమారి, జానకి, అరుణ, మరియు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘము జిల్లా అధ్యక్షులు కాటమయ్య, ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన చింతకోటమ్మ తిరుణాలు..

**సుండుపల్లె, మార్చి 10,ప్రభాతవార్త :**
మండలం పరిధిలోని చిన్నగొల్లపల్లి పంచాయతీ పూజారి వాండ్లపల్లెలో వెలసిన శ్రీ చింతకోటమ్మ తిరుణాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించగా, సోమవారం రాత్రి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణల మధ్య చాందినీ బండ్లను కట్టి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రమణ గౌడ్ ఆధ్వర్యంలో చింతకోటమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మరియు బంధుమిత్రులకు విందు ఏర్పాటు చేశారు. తిరుణాల సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## ఆమనగంటి శ్రీరాములు 105వ జయంతి నిర్వహణ

**పులివెందుల, మార్చి 10, ప్రభాత వార్త :**
ఏపీ ఎన్జీఓస్ పులివెందుల తాలూకా కార్యాలయంలో ఆమనగంటి శ్రీరాములు 105వ జయంతిని నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు పులివెందుల తాలూకా అధ్యక్షుడు గజ్జల జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ట్రెజరర్ వై. రామ గంగాధర్ రెడ్డి యాదవ్, వైస్ ప్రెసిడెంట్లు ప్రభుకుమార్, జి. శంకరయ్య, వైస్ చైర్మన్ డి. బాలకృష్ణారెడ్డి, జేఏసీ వైస్ చైర్మన్ ఏ. శ్రీనివాసులు, కోకన్వీనర్ పి. గంగయ్య, పంచాయతీ రాజ్ శాఖ ఏవో సౌరెడ్డి తదితరులు పాల్గొని ఆమనగంటి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై నివాళులర్పించారు.

## మండల కేంద్రంలో ఆర్టీవో శివలింగయ్య వాహనాలు తనిఖీ

**రామసముద్రం మార్చి 10 ప్రభాతవార్త:**



రామసముద్రం మండలంలో ఆర్టీవో శివలింగయ్య మంగళవారం పలు వాహనాలను తనిఖీ చేశారు, బెంగళూరు నుండి వచ్చే వాహనాలు వెళ్లే వాహనాలను నిలిపి వాహనాల పైన, లగేజీ బాక్స్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాహనదారులు వద్ద లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి జరిమాన విధించారు. ఆర్టీవో శివలింగయ్య వాహన దారులతో సమావేశం నిర్వహించి ప్రతి ఒక్క వాహనదారులు సరైన పత్రాలను వాహనంలో ఉంచుకోవాలని ద్విచక్ర దారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. కారు నడిపే దారులు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ముఖ్యంగా వాహనాలు నడిపే వారు మద్యం సేవించి నడపరాదని మద్యం సేవించి పట్టు బడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఆర్టీవో శివలింగయ్య,ఏ ఎస్సై హిమాచలపతి సిబ్బంది ఉన్నారు.

## గట్టుశ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా శయనోత్సవం

**రామసముద్రం మార్చి 10 ప్రభాతవార్త :**



రామసముద్రం మండల కేంద్రంలోని చెంబకూరు గట్టు శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు చివరి రోజు ఆలయంలో మంగళవారం శయనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీ రామ చందర్ బటర్, అర్చకులబృందం వారిచే ఉదయం సుప్రభాత సేవతో స్వామి వారిని మేలుకొలిపి ఆలయ శుద్ధి చేసి స్వామి వారికి వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.స్వామి వారికి పలు రకాల గంధం చందనం,పుష్పాలతో అలంకరణ చేసి, పండ్లు, ఫలహారాలు సమర్పించారు, ఈ శయనోత్సవ వేడుకల అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని, భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు స్వామి వారిని దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## కొనుగోలు కేంద్రాల వలన రైతుకు లాభమేంటి?

### నీరున్న పంట కాలంలో ఉపాధి పనులు ఎందుకు

**రాజుపాళెం, మార్చి 10, ప్రభాతవార్త:**



పండించిన శనగ పంట అంతా దళారుల చేతుల్లోకి వెల్లాక ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎలాంటి లాభం లేదని, నీరు ఉన్న పంట కాలవల్లో ఉపాధి పనులు చేయడం ఎంతవరకు సబమని మండల ఉపాధ్యక్షుడు వెలవలి నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం మండల ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించడమైనది. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ శనగల పంట కోతలు పూర్తయి పంట అంతా దళారుల చేతుల్లోకి వెళ్లాక ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఏంటి లాభమని, పంట చేతికి రాకముందే ఈ ఏర్పాట్లు చేసి ఉంటే రైతులకు ఎంతో ఉపయోగ కరంగా ఉండేదని ఏవో శివరామకృష్ణారెడ్డిని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనులు చేపట్టడం పంట కాలవల్లో నీరు ప్రవహిస్తున్న నీళ్లలో పనులు చేయటం ఏమిటని ఏపీవో వసంత కుమార్‌ను ప్రశ్నించారు. అంగన్వాడి కేంద్రాలు నిర్మాణం పనులు ప్రారంభించి మూడేళ్లు అవుతున్న కొన్ని గ్రామాల్లో పూర్తి కాకపోవడం ఏమిటని ఐసిడిఎస్ సిడిపిఓ అరుణను అడిగారు. ప్రభుత్వం గ్రామ సచివాలయాలు, అంగన్వాడి కేంద్రాల పేర్లు మార్చడం వల్ల ఏమైనా లాభం ఉందా అని ఆయన అన్నారు. ప్రస్తుతం సాగుచేసిన పంటలకు మార్చి చివరి వరకు నీరు అందిస్తామని కేసీ కెనాల్ ఏఈ ఆశాజ్యోతి, మైలవరం కాలువ ఏఈ లలిత తెలుపుతూ దీనిని రైతులు గమనించాలని తెలిపారు. పంట చివరి దశలో నీటి తల్లు అవసరమైతే ఏప్రిల్ 15 వరకు విడుదల చేస్తే బాగుంటుందని ప్రజా ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమం ఇంచార్జి ఎంపీడీవో షాకీర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మం డల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములపై కబ్జాల అక్రమణలు

### కోట్ల విలువైన స్థలాలను కాపాడాలని ఆర్డీఓకు వినతి

**బద్వేలు, మార్చి 10, ప్రభాతవార్త**
బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గోపవరం మండలంలో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలు జరుగుతున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ ఎంఎల్ లిబరేషన్) జిల్లా స్థాయి నాయకుడు ఎస్. చంద్రశేఖర్ ఆరోపించారు. ప్రభుత్వ భూములను రక్షించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్ర మోహన్‌కు ఆధారాలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. నెల్లూరు-ముంబై జాతీయ రహదారి సమీపంలో గోపవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 168/1లో ఉన్న 49 సెంట్ల ప్రభుత్వ భూమిని పక్కనున్న పట్టా భూములతో కలిపి కొంతమంది ప్రహరీ గోడ నిర్మించి ఆక్రమించుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయం గతంలో పత్రికల ద్వారా వెలుగులోకి రావడంతో అప్పటి రెవెన్యూ అధికారులు ఆ ప్రహరీ గోడను తొలగించారని తెలిపారు. అయితే మళ్లీ అదే భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇటీవల బదిలీ అయిన తహసీల్దార్‌తో కొంతమంది ఒప్పందాలు కుదుర్చుకుని పనులు ప్రారంభించినట్లు ప్రచారం జరుగుతోందని విమర్శించారు. తక్షణమే ఆ 49 సెంట్ల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా సర్వే నంబర్లు 130, 1633/1, 1633/2, 1634/1లో ఉన్న సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని సమీపంలోని వెంచర్లలో కలిపి విక్రయించినట్లు



ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ భూమి విషయంలో కోటి రూపాయల వరకు లావాదేవీలు జరిగాయని ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. కొంత మంది రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా స్పందించిన బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్ర మోహన్, సర్వే నంబర్లు 168/1, 1633, 1634, 1665లను స్వయంగా పరిశీలించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అన్నీ తామై అంత్యక్రియలు

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 10, ప్రభాతవార్త:**



పట్టణానికి చెందిన సూర్యవతి అనే మహిళ మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఫోన్ ద్వారా మేఐహెల్ప్యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్‌ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి ఈరోజు హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్,వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా,ఈశ్వర్ వర్ధన్ రెడ్డి,అశోక్ కుమార్ పాల్గొని అంత్యక్రియలను పూర్తి చేశారు.మేఐహెల్ప్యు ఫౌండేషన్ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ, అవసరంలో ఉన్న వారికి అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు. శ్రీ అమ్మ శరణాలయంలోని వృద్దులకు సహాయం చేయదలచిన ఎవరైనా దాతలు ఉంటే 82972 53484, 9182244150ఈ నెంబర్లను సంప్రదించ వలసిందిగా వారు కోరారు.

## డెంగ్యూపై పోరాటానికి కదలిరండి

### జిల్లా మలేరియా అధికారి ఆర్. రామచంద్రారెడ్డి



**మదనపల్లె క్రైమ్, మార్చి 10 ప్రభాతవార్త.**
జిల్లాలో డెంగ్యూ నియంత్రణే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ముమ్మర చర్యలు చేపట్టారు. మంగళవారం ఆయన త్యాగరాజ వీధిలోని యు.పి.హెచ్.సిని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలతో కలిసి డెంగ్యూ, మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూను అదుపు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటిచెప్పేలా రూపొందించిన ఖిడెంగ్యూపై పోరాటానికి కదలిరండిఖి అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కీటక జనిత వ్యాధులైన డెంగ్యూ, మలేరియా పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సి న జాగ్రత్తలు, నిల్వ ఉన్న నీటిని తొలగించడం వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. వ్యాధుల నియంత్రణ అనేది కేవలం ఆరోగ్య శాఖ బాధ్యతే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లా ఖాన్, గంగయ్య గౌడ, దివాకర్, కిరణ్ కుమార్, సురేంద్ర, వైద్యధికారి జిలానీ, డి.ఇ.ఓ భాస్కర్, స్టాఫ్ నర్స్ రేష్మ, ల్యాబ్ టెక్నీషియన్లు జిలానీ బాషా, లీలావతి, లక్ష్మీదేవి, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేషనల్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



**గాలివీడు, మార్చి 10(ప్రభాతవార్త):**
హైదరాబాద్‌కు చెందిన అపెక్స్ ఐఐటీ-నీట్ ఫౌండేషన్ సంస్థ నిర్వహించిన నేషనల్ ఒలంపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో రవిచంద్ర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి మెడల్స్ సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్షలో భాగంగా నిర్వహించిన స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ సైజుథామస్ మాట్లాడుతూ అపెక్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల్లో దేశవ్యాప్తంగా 500కు పైగా పాఠశాలల విద్యార్థులతో పోటీపడి తమ పాఠశాల విద్యార్థులు మెడల్స్ సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జాజాయ్, ఐఐటీ ఇన్‌చార్జ్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు రమేష్, రామయ్య, ఆశిష్, శివప్రసాద్, షకీరా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కురబలకోట సెక్రటరీగా రామప్ప నాయుడు

**కురబలకోట మార్చి 10 ప్రభాతవార్త**



కురబలకోట గ్రామ పంచాయతీ సెక్రటరీగా రామప్ప నాయుడు నియమించినట్లు ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సెక్రటరీ గురు మోహన్ జిల్లా పంచాయతీ కార్యాలయా నికి బదిలీ అయ్యారు. గత రెండు సంవత్సరాలుగా రెగ్యులర్ సెక్రెటరీ లేక పాలన కొనసాగింది. ఈ సందర్భంగా సెక్రెటరీ రామప్ప నాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

## మహిళా విద్యకు బీజం వేసిన చరిత్ర సావిత్రిబాయి

### చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ



**ప్రొద్దుటూరు మార్చి10, ప్రభాతవార్త :**
భారతదేశ కుల వ్యవస్థను దిక్కరించి మహిళా విద్య కోసం పోరాడిన చరిత్ర సావిత్రిబాయి పూలే దనీ చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ పేర్కొన్నారు. మంగళవారం చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ నగర్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో నిర్వహించారు ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ ఇంటి నుండి సమాజాన్ని చక్కని బాధ్యతలు ఇప్పటికీ స్త్రీకే ప్రాముఖ్యత ఉందన్నారు. స్త్రీలపై వేధింపులు హింసకు మూలమైన మద్యపానంను నిషేధించాలని ప్రభుత్వాలపై గలమెత్తాలన్నారు. సమత అధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ స్త్రీపురుషుల అసమానతల రూపు మార్చిన చరిత్ర మార్చి 8 అన్నారు. డాక్టర్ నాగజ్యోతి మాట్లాడుతూ ఆడవాళ్లు ఆరోగ్యంగా ఉంటేనే ప్రతి కుటుంబంతో పాటు సమాజమంతా ఆరోగ్యం అంతగా ఉంటుందన్నారు. అడ్వకేట్ హరిత మాట్లాడుతూ రాజ్యాంగం సమాన హక్కులు ఇచ్చిన స్త్రీ పురుషుల సమాత్వం కోసం పోరాడాల్సి ఉందన్నారు. ఆర్‌వివి జిల్లా కన్వీనర్ మహమూద్ మాట్లాడుతూ సావిత్రిబాయి లాంటి మహనీయురాలు చేసిన త్యాగాలను గుర్తు చేసుకొని మహిళలు చైతన్యం పొందాలన్నారు తెలుగు లెక్చరర్ డాక్టర్ దస్తగిరి సీఎంఎస్ సభ్యురాలు అనిత పాడిన పాటలు మహిళలను ఉత్తేజపరిచాయి కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు లెక్చరర్ సురేష్ బాబు టీచర్ జగదీష్, మహిళా శక్తి కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, సీఎంఎస్ పట్టణ కన్వీనర్ కనికంటి లక్ష్మీదేవి చంద్రావతి నాగవేణి కృష్ణవేణి బిసి నాయకుడు బొర్రా రామాంజనేయులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**
I, SHAIK MALIKA BEGUM, W/o. SHAIK SHAFI SAHEB, resident of D.No.1/1910-3-1, S.R. Nagar, Near Arogyamatha Church, YSR Kadapa Dist., A.P.-516004. In my passport (G0559385) my husband name mentioned as SHAIK SHEPPI SAHEB instead of SHAIK SHAFI SAHEB (Correct Name) and his passport No. AH783442 issued at Vijayawada on 04-11-2025.

## గ్లకోమా వ్యాధిపై జాగ్రత్తలు అవసరం

**మదనపల్లెక్రైమ్, మార్చి 10 ప్రభాతవార్త.**



నీటి చుక్కల వ్యాధి (గ్లకోమా) పట్ల జాగ్రత్తలు అవసరమని జిల్లా ఆస్పత్రి కంటి వైద్య నిపుణురాలు దివ్య తెలిపారు. జాతీయ గ్లోకోమా వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా ఆస్పత్రిలోని రోగులకు నీటి చుక్కల వ్యాధి వ్యాపి, నివారణ మార్గాలపై డాక్టర్ వివరించారు. ఈ వ్యాధి కంటి నరాలకు నష్టం కలిగించి, దృష్టిలోపానికి దారితీయవచ్చన్నారు, 40 ఏళ్ల పై బడ్డ వారిలో గ్లకోమా వ్యాధి వస్తుందన్నారు. గ్లోకోమా వ్యాధి వారసత్వంగా వచ్చే అవకాశం ఉందన్నారు. అలాంటి వారు కంటి పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెడిసిన్స్ ద్వారా కంటిలో నీటి ఒత్తిడిని తగ్గించవచ్చని, లేసర్ ట్రీట్మెంట్ వల్ల వ్యాధిని అరికట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ఆప్తమాలజిస్ట్ ఆజాద్, అర్జున్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## చెట్టుపై నుంచి పడి యువకుడికి గాయాలు

**మదనపల్లెక్రైమ్, మార్చి 10 ప్రభాతవార్త.**

చింతచెట్టు పైనుంచి పడి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. ఘటనపై బాధితుడి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. గంగన్నగారిపల్లి కి చెందిన రామన్న కుమారుడు ఎం.రవి నిమ్మనపల్లి రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న చింత తోపులో చింతకాయలు కోయడానికి కూలి పనులకు వెళ్ళాడు. చెట్టు ఎక్కి కాయలు కోస్తూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి పనివారు బాధితున్ని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## బస్సు ఢీకొని తండ్రి కుమారుడికి గాయాలు

**మదనపల్లెక్రైమ్, మార్చి 10 ప్రభాతవార్త.**



బస్సు ఢీకొని తండ్రి, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. ఘటనపై వాల్మీకిపురం ఎస్సై తిప్పేస్వామి కథనం మేరకు.. వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీకి చెందిన శ్రీరాములు అతని కుమారుడు దేవాన్ష్‌లు ద్విచక్ర వాహనంలో స్థానికంగా ఉన్న దుకాణానికి వెళ్లారు. కావాల్సిన సరుకులు కొనుగోలు చేసి ఇంటికి బయల్దేరారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ప్రైవేటు ఎంఎం బస్సు వేగంగా వచ్చి వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తండ్రి, కుమారుడిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. వాల్మీకిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా నివాళులు

**ఎడ్యుకేషన్ మార్చి 10 ప్రభాతవార్త :**



నగరంలో పిఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో సామాజిక సంస్కరణవాది, భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సందర్భంగా మంగళవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ మాట్లాడుతూ, బాలికలు మరియు మహిళల విద్య కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. సమాజంలో సమానత్వం కోసం ఆమె చేసిన సేవలు అందరికీ ఆదర్శమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, నగర నాయకులు సంజీవ్, వెంకట ప్రసాద్, బాలనరసింహులు, వినయ్, రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు తల్లి బిడ్డకు రక్షణ

**తొండూరు మార్చి 10 ప్రభాతవార్త:**



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొండూరు యందు ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమం డాక్టర్ సుభాషిణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలకు పరీక్షలు, హీమోగ్లోబిన్, మధుమేహ రక్తపరీక్షలు, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రమాదకర (హైరిస్క్) గర్భవతులకు త్వరగా గుర్తించాలని త్వరగా సేవలు అందించడం వలన ఇబ్బందులు లేని ప్రసవాలు చేసి తల్లి, బిడ్డలు రక్షించ వచ్చని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని NTR వైద్య సేవలు (ఆరోగ్య శ్రీ) ద్వారా ఉచిత ప్రసవాలను ప్రోత్సహించాలని తెలియచేశారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య ముఖాముఖి కౌన్సిలింగ్ ద్వారా సుఖ ప్రసవం కొరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఇందులో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, సమాజ ఆరోగ్య అధికారిని సోమేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి, స్టాఫ్ నర్స్ మేరీ, ఫార్మసీ అధికారి మోహన్ మూర్తి, ఆరోగ్యకార్యకర్త మంజుల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద రోగుల ప్రాణాలతో చెలగాటం..

**ఆసుపత్రిలో మందుల కొరతపై బహుజన యువసేన నిరసన**

**మదనపల్లె క్రైమ్, మార్చి 10 ప్రభాతవార్త.**



జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరతతో ప్రభుత్వం పేద రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని బహుజన యువ సేన అధ్యక్షుడు పునీత్ కుమార్ నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మదనపల్లి ప్రభుత్వాసుపత్రిలోని సమస్యలను మెడికల్ సూపరింటెండెంట్ రమేష్ విన్నవించారు. అనంతరం పునీత్ విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో నెలకొన్న దుస్థితిపై పలుమార్లు అధికారులకు విన్నవించిన తీరు మారకపోవడం బాధాకరమన్నారు. ఒకవేళ ఆసుపత్రిలో మందులు సరఫరా చేయలేకపోతే, వెంటనే ఆసుపత్రి ప్రాంగణంలో "ఈ ఆసుపత్రిలో మందులు అందుబాటులో లేవు" అని పెద్ద బోర్డు ఏర్పాటు అయ్యిందని అధికారులకు సూచించారు. తద్వారా పేద ప్రజలు ఆశతో వచ్చి మోసపోకుండా ఉంటారని ఎద్దేవా చేశారు. సమస్య అధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకోకపోవడం వల్ల ఉచిత వైద్యం అనేది కేవలం కాగితాలకే పరిమితమైందన్నారు. జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం తక్షణమే స్పందించి మందులు సరఫరా చేయాలని పునీత్ కుమార్ డిమాండ్ చేశారు.

## హెచ్ఐవి నివారణకు సమన్వయంతో పని చేయాలి

**మదనపల్లె క్రైమ్, మార్చి 10 ప్రభాతవార్త.**



హెచ్ఐవి నివారణ కోసం అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య అన్నారు. మంగళవారం స్థానిక డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలోని ఏఆర్టి, ఐసిటిసి, ఎస్టిఐ, ఎన్జీవోల ప్రతినిధులతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ దిశా పరిధిలోని అన్ని శాఖలు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. హెచ్ఐవిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాజిటివ్ కేసులు అన్నిటిని ఏఆర్టిలో నమోదు చేయాలన్నారు. పాజిటివ్ కేసులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎల్ రాధిక, డాక్టర్ రమేష్ బాబు, సిపిఎం డేవిడ్ భాస్కర్, జిల్లా సూపర్వైజర్ ప్రసాద్, ఆనంద్, ఆర్ఆర్ఎస్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రీబాయి స్ఫూర్తితో పోరాడదాం

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త**



సావిత్రీబాయి స్ఫూర్తితో మహిళా వివక్షపై పోరాడదామని జనవిజ్ఞాన వేదిక నాయకులు డా. జయసత్య అన్నారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన "నేను సావిత్రీబాయిని" పుస్తకావిష్కరణ సభకు మురళీగుప్త అధ్యక్షత వహించారు. డా. జయసత్య మాట్లాడుతూ బాలికా విద్య కోసం ఎన్నో అవమానాలు ఎదుర్కొని వారి కోసం 1848 లో ఎనిమిది మందితో తొలి మహిళా పాఠశాలను స్థాపించారు. బాల్యవివాహాలను వ్యతిరేకించిందన్నారు. జిల్లా యూత్ కన్వీనర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్లకు రావడానికి వేతనాలు కూడా ఇచ్చి వారికి విద్య నేర్పించింది. అజ్ఞానమనే శత్రువును పారత్రోలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు సునీత, రచయిత జింకా సుబ్రమణ్యం, గౌరవ సలహాదారులు గోపీనాథ్‌రెడ్డి, డా. మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, చెకుముకి కన్వీనర్ రవి బాబు, నరేష్, ఆరవేటి చంద్రశేఖర్, కరిముల్లా, శిరీష, చిన్నవెంకటయ్య, గురుశేఖర్‌రెడ్డి, లెక్చరర్ లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## గూడ్స్ రైలు కిందపడి వ్యక్తి మృతి

**సిద్ధవటం మార్చి 10 ప్రభాతవార్త.**

కడప భాకరాపేట రహదారి రైల్వే గేట్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ప్రొద్దుటూరుకు చెందిన శంకర్ (37) మృతి చెందారు. గూడ్స్ రైలు కింద పడటంతో తల, ముఖానికి తీవ్ర గాయాలైన ఆయన్ని పోలీసులు కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం శంకర్ మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సునీల్ కుమార్ రెడ్డి తెలిపారు. మృతుడు ప్రొద్దుటూరు వసంతపేటకు చెందిన నాగయ్య కుమారుడిగా పోలీసులు గుర్తించారు.

## నిత్యపూజకోనలో శుభ్రత పరిశుభ్రత

**సిద్ధవటం,మార్చి 10 ప్రభాతవార్త.**



నిత్య పూజ కోనలో అపరిశుభ్రత ప్రాంతాలు కూలీలచే తొలగింపు చేపట్టామని ఇన్చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. మండలంలోని వంతాటిపల్లి గ్రామం లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజస్వామికోనలో ఫిబ్రవరి 14,15,16,లలో మహాశివరాత్రి ఉత్సవాల దృశ్య పేరుకుపోయిన అపరిశుభ్రత కూలీలచే తొలగింపు చేపడుతున్నామని ఇన్చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ కొరకై నిత్య పూజకోన పంచలింగాలగుడి, సన్నిధానంలో ఏర్పడ్డ ప్లాస్టిక్ వంటి పదార్థాలను కూలీలచే, తొలగింపు చేపడుతున్నామని తెలిపారు. వన్యప్రాణులు దృష్టిలో పెట్టుకొని కొండ ప్రాంతాలలో నిప్పు పెట్టకూడదని వన్యప్రాణుల మనుగడ కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది చంద్ర కూలీలు పాల్గొన్నారు.

## రెండురోజుల పాటు విశ్వకర్మ ఎగ్జిబిషన్

**మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :**

మదనపల్లెలో ఈనెల 13నుంచి 15వరకు రెండు రోజులు పాటు సిటిఎం రోడ్డులోని పద్మావతి కళ్యాణ మండపం నందు విశ్వకర్మ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ డివిఎస్ఆర్ మూర్తి, డిఎఫ్ఓలు ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్టణం ఆధ్వర్యంలో జిల్లా పరిశ్రమల కేంద్రం, డిఆర్డిఏ అన్నమయ్య జిల్లా సహకారంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఎగ్జిబిషన్ కమ్ ట్రేడ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో 50కిపై స్టాల్స్‌ను ఏర్పాటు చేసి విశ్వకర్మ పథకానికి చెందిన వివిధ సాంప్రదాయ వృత్తుల కళాకారుల ఉత్పత్తులు, పనితీరును ప్రదర్శించనున్నారన్నారు. ఈఎగ్జిబిషన్ ద్వారా విశ్వకర్మ అస్థకళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశం కల్పించడమే కాకుండా తయారీ దారులు, వ్యాపారులు, వినియోగదారులు పరస్పరం ప్రత్యక్షంగా కలుసుకునే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. వివరాలకు 9492689462 సెల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా జేసి నియామకం

**మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :**



మదనపల్లె సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీకి స్పెషల్ ఆఫీసర్‌గా అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మను నియామకం చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. మున్సిపల్ పాలకవర్గం ఈనెల 17తో ముగియనుండడంతో ప్రత్యేక అధికారిగా జాయింట్ కలెక్టర్‌ను నియమించింది. మదనపల్లె మున్సిపాలిటీతో పాటు పుంగనూరు గ్రేడ్-2 మున్సిపాలిటీకి చిత్తూరు డివిజనల్ రెవెన్యూ అధికారిని నియమించింది. రాయచోటి స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీకి రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించింది. రాష్ట్రంలోని కార్పొరేషన్‌లు, 86 మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియామకం చేసింది. ఈనెల 18నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో మున్సిపల్ అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నాయి.

## ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి

**మైదుకూరు, మార్చి 10, ప్రభాతవార్త:**



ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల కార్మిక వర్గాలకు రావలసిన ఆర్థిక బకాయిలను చెల్లించాలని ఏపి జెఏసి జిల్లా వైస్ చైర్మన్ పాల కొండయ్య ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో నియోజకవర్గ ఏపిజెఏసి నూతన కార్యవర్గ ఎన్నిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో జరిగే ఏ ఉద్యమాలలో అయినా ఎక్కువ సంఖ్యలో పాల్గొని మన హక్కులు సాధించుకోవాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, పోలీసులకు 57 మెమోను అమలు పరచి వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఏపిజెఏసి నియోజకవర్గ ఛైర్మెన్ గా చంద్రమోళి,వైస్ చైర్మన్లుగా బి.కె సురేష్, రవి కుమార్,వి.ఎస్ రాయుడు, కన్వీనర్ గా రాఘవయ్య, కో కన్వీనర్లుగా విజయుడు, గురుప్రసాద్, బాల సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ సెక్రటరీగా చంద్ర శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బాబు,కార్యవర్గ సభ్యులు జనార్ధన్,రాజన్న, పెంచల్ రెడ్డి,సుబ్బరాయుడు, పుల్లయ్య ఎలీసమ్మ గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

**బోయకొండ(చౌడేపల్లి), మార్చి 10 ప్రభాతవార్త**



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని దేవాదాయధర్మాదాయశాఖ ఆర్‌జేసీ(తిరుపతి) చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. మంగళవారం కొండలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. కొండకింద వసతిగృహము, పంచాయతీరాజ్‌శాఖ ఆలయానికి స్వాధీన పరచిన కమ్యూనిటీ భవనము, కొండపైకి మెట్ల మార్గంలో యాత్రీల నీడకోసం వేస్తున్న రూఫ్‌టాప్, కొండపైన మరుగుదొడ్ల నిర్మాణాలను ఆయన తనిఖీ చేసారు. అదే విధంగా కార్యాలయంలోని సిసి కెమెరాలను పరిశీలించి ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరంకు పలు సూచనలిచ్చారు. అనంతరం ఆయనకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. ఎండోమెంటు డిఇ జనార్ధన్, ఎఇఇ ఆనంద్, దేవస్థానం వర్క్‌ఇన్‌స్పెక్టర్ ద్వారకనాథ్ పాల్గొన్నారు.

## అక్రమ బియ్యానికి ఎటువంటి సంబంధం లేదు : డీలర్ల విన్నపం

**పీలేరు మార్చి 10 ప్రభాతవార్త:**



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్

గత నాలుగు రోజుల క్రితం పీలేరు మండల పరిధిలోని దేవేంద్ర అనే వ్యక్తి గోదాములో రేషన్ బియ్యం రాగులు తదితర చౌక దుకాణ సరుకులను విజిలెన్స్ అధికారులు దాడి చేసి సుమారు పది టన్నులు బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంగతి పాటకులకు విధితమే .అయితే కొంతమంది తమపై డిప్యూటీ తహసిల్దారు సివిల్ సప్లై విజయ్ కుమార్ రెడ్డి పై అబాండాలు వేయటం ఎంతవరకు సమంజసం కాదని వారు తెలిపారు. మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్‌తో సమావేశమైన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు వేలిముద్రలు తీసుకొని పంపిణీ చేస్తామని తీసుకున్న అనంతరం కొంతమంది వ్యాపారస్తులు కార్డుదారులకు ఎరవేసి అధిక మొత్తంలో బేరం కుదుర్చుకొని పక్క గ్రామాలలో సైతం పక్క మండలాల్లో సైతం రేషన్ బియ్యాన్ని పోగు చేసుకుని వ్యాపార నిమిత్తం అక్రమవ్యాపారం చేస్తున్న దేవేంద్రపై గతంలో కూడా కేసుల నమోదు అయ్యాయని అక్రమ వ్యాపారం మానుకొని దేవేంద్ర తిరిగి రేషన్ బియ్యం వ్యాపారాన్ని కొనసాగించడం, సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దారు విజయ్ కుమార్‌రెడ్డిగాని మండలంలో రేషన్ డీలర్లకు గాని ఎటువంటి సంబంధం లేదని వారు తెలిపారు. ఈ సమావేశంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, చిన్న రెడ్డప్ప ,అమర్నాథ్ రెడ్డి బాబా సబ్ తో పాటు 56 మంది డీలర్లు పాల్గొన్నట్లు వారు తెలిపారు.

**డీలర్లు తప్పు చేస్తే డీలర్ లైసెన్స్ రద్దు చేస్తాం : తహసిల్దార్**

మండల పరిధిలో ఉన్న రేషన్ షాప్ డీలర్లు పేదలకు ఇవ్వాల్సిన రేషన్ షాపులో అందించే వస్తువులను వ్యాపారస్తులకు అమ్ముకున్న వారి కంట కనపడకుండా సరుకు మాయం చేసిన విచారణలో తేలితే డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని తహసిల్దారు శివకుమార్ హెచ్చరించారు.

## టిడిపి రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి సిబ్బాల

**పీలేరు మార్చి 10 ప్రభాతవార్త:**



సన్మానిస్తున్న దృశ్యం

తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన సిబ్బాల చంద్రమోహన్ (చిట్టి)ని ఏపీ ఎస్సీ ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు, గిరిజన యానాది సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్ కుమార్ నేడు కలకడ మండలం కోన నందు దృశ్యాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీ వర్గానికి చెందిన సిబ్బాల చంద్రమోహన్ కి టిడిపిలో కీలకమైన పదవి రావడం బలహీన వర్గాల ప్రజల సంతోషదగ్గ విషయమని భవిష్యత్తులో సిబ్బాల చంద్రమోహన్ మరిన్ని ఉన్నత పదవులు అవరోధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రజల అభివృద్ధికి తోడ్పాటు అందించి బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలవాలని వీరు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోన మాజీ సర్పంచ్ గుద్దిటి త్యాగరాజు, టిడిపి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సాదు రామాంజులు, పాలకుంట చౌడప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు లేక ప్రజలు అవస్థలు

**బద్వేల్ రూరల్, మార్చి 10, ప్రభాతవార్త**

మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి పనులు లేక గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు కూడా లేకపోవడంతో జీవనోపాధి కష్టతరంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి పనులపై ఆధారపడే కుటుంబాలు ఆదాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. పనులు లేకపోవడంతో ఇంటి వద్ద గడవక ఖాళీగా ఉండాల్సి వస్తోందని, పిల్లల చదువు, కుటుంబ ఖర్చులు నిర్వహించడం కూడా కష్టంగా మారిందని గ్రామస్తులు వాపోయారు. అధికారులు స్పందించి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ప్రారంభించి తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

## ఆర్టీసీ హౌసింగ్ స్థలాల ఆక్రమణపై ఫిర్యాదు

**పీలేరు, మార్చి 10 ప్రభాతవార్త:**



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పీలేరు ఏపీఎస్ ఆర్టీసీ డిపోలోని ఉద్యోగులకు సంబంధించిన ఆర్టీసీ హౌసింగ్ స్థలాల ఆక్రమణలు అరికట్టాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి అనంతరం తహశీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013లో ఆర్టీసీ ఉద్యోగులు కలసి ఒక్కొక్కరు చందాలు వేసి రూ. 1.95 కోట్లతో 19 ఎకరాల డీకేటీ భూమిని కొనుగోలు చేశారన్నారు. అయితే అప్పట్లో అధికారులకు అవతవకలకు పాల్పడ్డారని, ఈ విషయంపై కోర్టులో కూడా కేసు నడుస్తోందని తెలిపారు. అనంతరం ఆ స్థలాన్ని చదును చేసి ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. అయితే కొందరు ఆ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ఆ స్థలానికి సంబంధించి సర్వే నిర్వహించి హద్దులు చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు జి. గోవిందు, రమణయ్య, స్వామి, శంకరయ్య, గుర్రప్ప, రెడ్డెప్పనాయుడు, కరీముల్లా, మూర్తి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలి

**చౌడేపల్లి, మార్చి 10 ప్రభాతవార్త**



పన్నులు వసూలు చేస్తున్న అధికారులు

పంచాయతీకి సంబంధించిన అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నేతాజీ నగర్, బస్టాండు పరిసర ప్రాంతాల్లో ఆయన ఇంటి, దుకాణాలకు చెందిన పన్నులను వసూలు చేసారు. పంచాతీయ అభివృద్ధి పన్నుల వసూళ్ళపై ఆధారపడి వుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సకాలంలో చెల్లిస్తే వారికి ఎలాంటి అపరాధ రుసుములుండవన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్ళి పన్నుల చెల్లింపులపై అవగాహన కల్పించారు. కార్యదర్శి శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## చలో విజయవాడ కరపత్రాల విడుదల

**ముద్దనూరు, మార్చి10 ప్రభాతవార్త:**



ఏపీ ఎమ్మార్పీఎస్, ఏఎంఎంఎస్ ఆధ్వర్యంలో మార్చి 14వ తేదీన విజయవాడలో నిర్వహించే చలో విజయవాడ పోస్టర్ను ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య సూచనల మేరకు మంగళవారం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్లయ్య మాదిగ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టడానికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని, మరిన్ని మహిళల డిమాండ్లపై కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈ ఎమ్మార్పీఎస్ సభ్యులు పెద్ద పుల్లయ్య, ఓబులేష్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రుణాల చెల్లింపు సక్రమంగా చేపట్టాలి

**పీలేరు, మార్చి 10 ప్రభాతవార్త;**



2025,26 సంవత్సరానికి జిల్లాలో 244 బ్యాంకుల ద్వారా రూ.16,619 కోట్లు రుణాలు లక్ష్యం కాగా రూ.18,042 కోట్లు రుణాలు పంపిణీ చేసి లక్ష్యాన్ని అధిగమించినట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ జి. ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లు, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వ్యవసాయ రుణాలు రూ.12.272 కోట్లుకు గానూ రూ.12,533 కోట్లు, పరిశ్రమల శాఖకు రూ.14,94 కోట్లుకుగానూ రూ.12.09 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో ముద్ర రుణాలు 18,665 యూనిట్లకు గానూ రూ. 436 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు. 14,062 గ్రూపులకు రూ.13.45 కోట్లు రుణాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. రుణాలు రికవరీ సకాలంలో చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ఆర్. లక్ష్మీప్రసాదొడ్డి, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

## మహిళా విద్యకు మార్గదర్శకురాలు పూలే

**పీలేరు మార్చి 10 ప్రభాతవార్త:**

తన భర్త జ్యోతిరావు పూలే వద్ద విద్యను అభ్యసించి సామాజిక నిబంధనలను దిక్కరించి మహిళలు మరియు అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడానికి తన జీవితాన్ని అంకితం చేసి దేశంలో మహిళా విద్యకు మార్గదర్శకురాలిగా నిలిచిన సావిత్రిబాయి పూలే. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలకు, అంటరాని తనం నిర్మూలనకు స్త్రీ విద్య కోసం స్ఫూర్తిగా నిలిచిన ఏకైక మహిళలు సావిత్రిబాయి పూలే. సమాజ కట్టుబాట్లను ధిక్కరించి, ఆమె చేసిన సాహసం నేటి ఆధునిక మహిళా శక్తికి బలమైన పునాదిగా నిలిచిందని ఆమె వర్ధంతి సందర్భంగా నివాళులరించారు.

## కరెంటోళ్ల జనబాట

**పెండ్లిమర్రి, మార్చి 10, ప్రభాతవార్త:**



కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో భాగంగా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ పెండ్లిమర్రి మండలంలోని నందిమండలం సెక్షన్ పరిధిలోని తిప్పరాజుపల్లి గ్రామంలో మంగళవారం పర్యటించారు. నందిమండలం అసిస్టెంట్ ఇంజనీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటనలో ఎస్ఈ గ్రామంలోని విద్యుత్తు సరఫరా వ్యవస్థలను సమగ్రంగా పరిశీలించారు. లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కనెక్షన్లు, లోడు పరిస్థితులను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి విద్యుత్తు సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్తు శాఖ సిబ్బంది రాత్రి,పగలు తేడా లేకుండా మా సమస్యలను తెలిపిన వెంటనే పరిష్కరిస్తున్నారు. మా ఇంటి వద్దకే వచ్చి సమస్యలు అడిగి తెలుసుకోవడం మాకు ఎంతో ఆనందంగా ఉందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఉచిత విద్యుత్తు పొందే విధానం, అలాగే విద్యుత్తు భద్రతా నియమాలపై అవగాహన గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నందిమండలం అసిస్టెంట్ ఇంజినీర్ నవనీత, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు చెందిన పది ప్రశ్న పత్రాలు

**దువ్వూరు, మార్చి 10, ప్రభాతవార్త:**

పదవ తరగతి ప్రశ్నా పత్రాలు మంగళవారం దువ్వూరు పోలీస్ స్టేషన్ కు చేరాయి. మండలంలో 460 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాస్తున్నారు. అందుకు సంబంధించిన ప్రశ్న పత్రాలు మంగళవారం పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసి వాటిని ఆయా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులకు అందజేశారు. స్వాధీనం చేసుకున్న ప్రశ్నా పత్రాలను పోలీస్ స్టేషన్ కు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరిచారు. మండలంలో మూడు హైస్కూల్ లలో పదవ తరగతి పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించారని అందులో దువ్వూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 171మంది, పుల్లారెడ్డి పేటలో 170 మంది, కస్తూరిబాలో 119 మంది 10వ తరగతి పరీక్షలు రాస్తున్నారని వీటికి సంబంధించిన ప్రశ్న పత్రాలను స్టేషన్లో ఉంచామన్నారు. ఈనెల 16వ తేదీన పదవ తరగతి పరీక్షలు మొదలవుతున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు.

## పోలీస్ స్టేషన్లో భద్రపరిచిన 10వ తరగతి ప్రశ్నపత్రాలు

**సుండుపల్లె, మార్చి 10,ప్రభాతవార్త :**

ఈ నెల 16వ తేదీ నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన సెట్-1 ప్రశ్నాపత్రాలను మండల విద్యాశాఖ అధికారి బి. వెంకటేష్ నాయక్ మరియు అడిషనల్ రూట్ ఆఫీసర్, వీరబల్లి మండల విద్యాశాఖ అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో, సిబ్బంది సహకారంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. మండలంలోని మొత్తం 484 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓ తెలిపారు.

## గ్లకోమారహిత ప్రపంచమే లక్ష్యం

**కె.వి పల్లి మార్చి10 ప్రభాతవార్త:**



గ్లకోమా రహిత ప్రపంచం కోసం ఐక్యంగా ఉద్యమించి గ్లకోమా అనే కంటి జబ్బుపై ప్రజలకు అవగాహన కల్పిద్దాం అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. మంగళవారం చింతపర్తి పి.హెచ్.సిలో నిర్వహించిన ఆశా దినోత్సవంలో ప్రపంచ గ్లకోమా అవగాహనా వారోత్సావాలలో భాగంగా గ్లకోమా పై అవగాహన కల్పించి కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మాట్లాడుచు కంటిలోని ఒత్తిడి పెరగడం వల్ల కలిగే ఆప్టిక్ నాడిని దెబ్బతీసే కంటి వ్యాధుల సమూహము. కంటి నుండి మెదడుకు దృశ్య సమాచారన్ని ప్రసారం చేయడానికి బాధ్యత వహించే ఆప్టిక్ నాడికి కూలుకోలేని నష్టాన్ని కల్గిస్తుంది. సకాలంలో చికిత్స అందించకుంటే పూర్తిగా అంధత్వానికి దారి తీస్తుంది. ఈ వ్యాధికి కంటి మందులు, లేజర్ చికిత్స, ఆపరేషన్ ద్వారా ఉన్న కంటిచూపు దెబ్బ తినకుండా కాపాడవచ్చు. చీకటిలో మొబైల్, ల్యాప్టాప్ చూడరాదు. ప్రతీ అరగంట కు ఒకసారి కంటికి ఐదు నిముషాలు విశ్రాంతి ఇవ్వాలి. బి. పీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగ, ఆసనాలు నిత్యం చేయాలి. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ, సి. హెచ్. ఓ అరుణ, పర్యవేక్షకులు భానుబీ, బహుద్దీన్, ఎమ్. ఎల్. హెచ్. పి లు, ఏ. ఎన్. ఎమ్ లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి... ఎంపీపీ

**చాపాడు. మార్చి10.ప్రభాతవార్త :**



రానున్న వేసవి దృష్ట్యా గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అధ్యక్షుడు టి.లక్ష్మయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయసభాభవనం నందు మంగళవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో గ్రామాలలో ప్రజలు నీటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. వేసవిదృష్ట్యా ఉపాధి పనులు జరిగే ప్రదేశాలలో కూలీలు ఇబ్బందులు పడకుండా వైద్య సిబ్బంది, ఉపాధి సిబ్బంది కూలీలకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. తమ సర్పంచ్ పదవి కాలం ముగుస్తున్నప్పటికీ తానుచేసిన పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయలేదని అన్నవరం సర్పంచ్ పీరయ్యస భాదృష్టికి తీసుకెళ్లగాత్వరలోబిల్లులు మంజూరు చేస్తామని డిప్యూటీఎంపీడీవో హరినాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపమండల అధ్యక్షుడు బాలనరసింహారెడ్డి తహసీల్దార్ రమాకుమారి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణారెడ్డి, వ్యవసాయ అధికారిని దేవి పద్మలత, డాక్టర్ శివప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఓబులేసు, పంచాయతీరాజ్ ఇంజనీరుచంద్రమోళి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టాలి

**కడప, మార్చి 10 ప్రభాతవార్త :**

మత్తుపదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టడానికి జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లాలో మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై జిల్లా స్థాయి యాక్షన్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు చంద్రమోహన్,చిన్నయ్య, కడప మున్సిపల్ కమీషనర్ రాకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట సబ్ కలెక్టర్ భావన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మూల సరఫరా రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పటిష్టమైన నిఘా చర్యలు అవలంబించాలని తెలిపారు. విద్యార్థులు,ఆటో డ్రైవర్లు, వర్కర్లను లక్ష్యంగా చేసుకుని సరఫరా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మాదకద్రవ్యాలు విక్రయాలు జరిగే చోట గట్టి నిఘా ఉంచాలన్నారు. మాదకద్రవ్యాల బారిన పడిన బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని పోలీస్ శాఖ కు సూచించారు. బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు పునరావాసం కల్పించాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల గురించి స్కూల్స్, కాలేజ్ లలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అధిక ప్రాచుర్యం ఉన్న సామాజిక మాధ్యమాల్లో డ్రగ్స్ నిరోధకంపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. గ్రామ స్థాయిలో ఆశ వర్కర్, మహిళా పోలీస్, ఏ.ఎన్.ఎం. అంగన్వాడీ వర్కర్స్ ల సహకారంతో మత్తు పదార్థాల వినియోగంపై పర్యవేక్షణ చేయాలన్నారు. స్కూల్స్ మరియు కాలేజ్ ల పరిసర ప్రాంతాల్లో ఎటువంటి మత్తు పదార్థాలు అమ్మకుండా చూడాలన్నారు. జిల్లాలో నితిబిలిని టీమ్స్ ద్వారా మాదకద్రవ్యాల నిరోధకం, వాడకం పై ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టడం జరుగుతొందన్నారు. రిమ్స్ ప్రాంగణంలోని డి.అడ్డిక్షన్ సెంటర్ ను ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ హాస్టళ్ల నందు డ్రగ్స్ వినియోగం జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. స్కూల్స్, కాలేజ్, హాస్టల్స్, మరియు దాబాలలో, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజ్‌లలో బోర్డులు మత్తు పదార్థాల నివారించే చర్యలపై పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉచితంగా హెచ్‌పివి టీకాలు

**మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :**

జిల్లాలోని 14ఏళ్ళ బాలికలకు ఉచితంగా హెచ్‌పివి టీకా అందజేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు తెలిపారు. మంగళవారం మదనపల్లె కలెక్టరేట్‌లో హెచ్‌పివి టీకా ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నుండి కౌమార దశ బాలికలను రక్షించేందుకు ఆరోగ్యశాఖ చేపట్టిన హెచ్‌పివి నివారణకు ఈ టీకా అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలను సమీపంలోని ప్రభుత్వాసుపత్రిలో, కమ్యూనిటి హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్ళి టీకా వేయించుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో ఈ టీకా పనిచేస్తుందన్నారు. కౌమార దశలో ఉన్న బాలికల ఆరోగ్యాన్ని కాపాడడమే కోసం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమనైజేషన్ అధికారి ఉషశ్రీ, కలెక్టర్ ఏఓ నాగభూషణం, తహశీల్దార్లు పాల్గొన్నారు.



## మనుస్మృతి చట్టాలను దగ్ధం చేసిన క్రాంతి పూలే



పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

**పీలేరు మార్చి 10 ప్రభాతవార్త:**

మనుస్మృతి చట్టాలను దగ్ధం చేసిన క్రాంతి జ్యోతి మాత సావిత్రిబాయి పూలే అని ఏపీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. మాత సావిత్రిబాయి పూలే 129 వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం పీలేరు పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీలో ఏపీ గిరిజన యానాది సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ మనుస్మృతి అమలు చేసిన దుర్మార్గమైన చట్టాలను మంటలకు ఆహుతి చేసిన క్రాంతి జ్యోతి, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. బాల్య వివాహాలు, సతీసహగమనం, అంటరానితనం వంటి దురాచారాల నిర్మూలనకు విరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ దళ పోరాట సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇంచార్జ్ వేలూరు పురుషోత్తం, సద్దల రామచంద్ర, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు యర్రబల్లి మల్లికార్జున, శివకుమార్, రామకృష్ణ, జ్యోతమ్మ, ప్రేమావతి, మల్లీశ్వరి, ముని కుమారి తదితరులు పాల్గొన్నారు.

## టిబి వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



**మదనపల్లెక్రైమ్, మార్చి 10 ప్రభాతవార్త.**

క్షేత్ర స్థాయిలో టీబి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సకాలంలో చికిత్సలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబి అధికారి డాక్టర్ రాధిక పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లె పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డు పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆశా వర్కర్ల సమావేశంలో పాల్గొని వారి ఫీల్డ్ స్థాయి ఆరోగ్య సేవలను సమీక్షించారు. నేషనల్ టీబి ఎలిమినేషన్ ప్రోగ్రాం (ఎన్టిఈపి) కింద చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో టీబి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించడం, స్పుటం నమూనాలను పరీక్షలకు పంపటం చేయాలన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రి చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి సమీప ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న టీబి ఉచిత పరీక్షలు, ఉచిత చికిత్స సేవలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. టీబి రోగులు చికిత్సను మధ్యలో ఆపకుండా పూర్తిగా తీసుకునేలా ఆశా కార్యకర్తలు పర్యవేక్షించి, కుటుంబ సభ్యులు, సమాజంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. టీబి నిర్మూలన లక్ష్యాన్ని సాధించడంలో ఆశా కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ సిబ్బంది సుధాకర్ రాజు, మదనపల్లి టీబి యూనిట్ సిబ్బంది ప్రభాకర్, శాంతి, సుశీల, తరుణ్, సిబ్బంది చంద్రశేఖర్, రెడ్డెప్ప, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టర్ సార్ ..పెద్దేరు ప్రాజెక్టు అభివృద్ధికి సహకరించండి

**తంబళ్లపల్లె. మార్చి 10 ప్రభాతవార్త :**

మండలంలోని జిల్లాలోనే అతిపెద్ద పెద్దేరు ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ స్పందించి పరిష్కరించాలని పెద్దేరు ప్రాజెక్టు ఆయకట్టు ఛైర్మన్ కొటాల శివకుమార్ కోరారు. మంగళవారం 2047 విజన్ టీం సభ్యులు పెద్దేరు ప్రాజెక్టు సమస్యలను అధ్యయనం చేశారు. వారికి ఛైర్మన్ శివకుమార్ ప్రాజెక్టుకు రహదారి మరమ్మతులు, పర్యాటకులకు బోటింగ్, చేప పిల్లల పెంపకం యూనిట్, ప్రాజెక్టు కింద బ్రిడ్జి నిర్మాణం, గెస్ట్‌హౌస్‌లు, ప్రధాన కాలవలు మరమ్మతులు, పార్కుల సుందరీ కరణ, పిల్ల కాలువల నిర్మాణం పనులు చేపట్టాలని వారికి విశదీకరించారు. ప్రాజెక్టు ఆయకట్టలో సుమారు 5000 ఎకరాలు సాగుతో పాటు రెండు మండలాల వేలాది మంది రైతులకు వ్యవసాయం తోపాటు కూలీలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రెండేళ్లగా ప్రాజెక్ట్ పార్క్ అలనా పాలనా లేక అడవిని తలపిస్తుండగా సౌకర్యాలు లేక పర్యాటకులు రాకపోకలు నిలిచి నిర్మానుషంగా తయారైంది. నేటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇక్కడ అధికార పార్టీకి ఇన్చార్జి లేక ప్రాజెక్ట్ అభివృద్ధి పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు లేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే 2047 విజన్ కార్యక్రమంలో ప్రాజెక్టు అభివృద్ధి చేపడితే వేలాదిమంది రైతులు, కూలీలకు జీవనోపాధి తోపాటు వేలాది మంది పర్యాటకులను ఆకర్షించి ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఏర్పాటు కావడం ఖాయం.





### ప్రాజెక్టు అభివృద్ధి ఎలా సాధ్యం

పేరుకు జిల్లాలోనే పెద్ద ప్రాజెక్టు. ఛైర్మన్ ఎన్నిక అయిన నాటి నుండి ఒక పైసా నిధులు లేవు అభివృద్ధి ఎలా చేయాలి. ప్రాజెక్టు సమస్యలపై రాష్ట్రస్థాయి మంత్రులు, అధికారులకు ఫిర్యాదులు చేశాను. సమస్యలు పరిష్కరిస్తే వేలాది ఎకరాల సాగు వేలాది మందికి జీవనోపాధి లభిస్తుంది. కలెక్టర్ గారైన స్పందించి 2047 విజన్ కార్యక్రమంలో ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నాను.

**కొటాల శివకుమార్, ఛైర్మన్.**

## ఘనంగా మహిళా దినోత్సవం

**నిమ్మనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :**



మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఇండియన్ బ్యాంకు మేనేజర్ చంద్రయ్య, అసిస్టెంట్ మేనేజర్ రచిత స్థానిక వెలుగు కార్యాలయంలో ఘనంగా మండలంలోని వెలుగు సిబ్బందికి సన్మానించి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు వెలుగులోని సంఘమిత్రాలు పట్టుకొమ్మలని తమవంతు విధిగా ప్రతి ఒక్కరికి రుణాలు ఇప్పించడం లోనూ, రికవరీలోనూ ముందుండాలన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం మురళి, సిసి శాంతమ్మ,సంఘమిత్రాలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఇండియన్‌బ్యాంకులో కూడా మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు.

## ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్

**బద్వేల్ మార్చి 10 ప్రభాతవార్త.**



తొట్టిగారి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ మరియు ఆశా కార్యకర్త సమావేశం జరపడమైనది. ఈ సమావేశము నందు డాక్టర్ జి. రాజేష్ కుమార్ పాల్గొని ఆశా కార్యకర్తల అజెండా, HPV వ్యాక్సిన్ యొక్క ఆవశ్యకత, 14 years Girl"s వ్యాక్సి వేసే విధానము మరియు . అమ్మాయికి వివాహ వయసు గురించి బ్యాలన్స్ డైట్ గురుంచి బాడీ మాస్ ఇండెక్స్ గురించి, ప్రెగ్నెన్సీ కిట్స్ చైల్డ్ మ్యారేజసెస్ గురించి టీబీ గురించి రొటీన్ వ్యాక్సిన్ గురించి ఆశా కార్యకర్తలకు మరయు ఆరోగ్య కార్యకర్తలు కు సిబ్బందికి వివరించడం అయినది, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయన్ కార్యక్రమం ప్రతినెల తొమ్మిది తారీకు నుండి 12 వ తారీకు లోపల జరుగును అని అదే విధంగా గర్భిణీలందరూ వచ్చి ఆరోగ్య పరీక్షలు చేపించుకొని ఆరోగ్య స్థితిని కనుక్కొని కష్టతరమైన గర్భిణీలను గుర్తించడానికి ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని ఆరోగ్య విద్య ద్వారా గర్భిణీలకు వివరించడమైనది. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.చంద్రవతి, విలేజి హెల్త్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఆరోగ్య కార్యకర్తలు ఆశలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడండి : ఎమ్మెల్యే



సెక్రటరీలతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :**

వేసవి సందర్భంగా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో రూరల్ మండల పంచాయితీ సెక్రటరీలతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సెక్రటరీలు ప్రజలకు అందుబాటులో ఉండి మౌళిక వసతుల కల్పనకు చర్యలుచేపట్టాలన్నారు. ప్రధానంగా తాగునీరు, మురుగునీటి కాలువలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయితీ సెక్రటరీలదే అన్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ తాజ్‌మస్రూన్, పంచాయితీ సెక్రటరీలు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజాభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ముఖ్యంగా మహిళల విద్యా అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ తిరుపాల్‌నాయక్, టిడిపి నాయకులు ఎరబలి వెంకటరమణారెడ్డి, రఘుపతినాయుడు, సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ప్రజలు ఫిర్యాదులు చేస్తే గ్రామాధికారులపై చర్యలు తప్పవు

### రెవెన్యూ సిబ్బంది సమావేశంలో తహసిల్దార్ శివకుమార్

**పీలేరు మార్చి 10 ప్రభాతవార్త:**

మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల విలేజ్ రెవెన్యూ అధికారులు పని తీరు మార్చుకోవాలని అదేవిధంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్‌కు అనుకూలంగా పనిచేయకపోతే ఇంటికి పంపించేందుకు వెనుకడబోమని తహసిల్దార్ శివకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు సర్వేర్లు సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు .అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో ప్రజా సౌకర్యాల కోసం ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సచివాలయాల్లో ప్రజలకు కావలసిన సౌకర్యాలు కల్పించాలని అదేవిధంగా మండల పరిధిలో ఉన్న ప్రతి వీఆర్వోలు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కు అనుకూలంగా పనిచేయాలని అలా చేయని పక్షంలో విఆర్వోలతో సహా గ్రామ సర్వేలను కూడా ఇంటికి పంపించేందుకు వెనుకాడబోనని తహసిల్దార్ హెచ్చరించారు విలేజ్ రెవెన్యూ అధికారులుపనితీరు మార్చుకోవాలి రెవెన్యూ ఇన్స్పెక్టర్ కు అనుగుణంగా సిబ్బంది పని చేయాలి పనిచేయకపోతే ఇంటికి పంపిస్తా తహసిల్దార్ శివకుమార్ ముఖ్యంగా ఇప్పటికే రెవెన్యూ సమస్యలే మండల పరిధిలో అధికంగా ఉన్నాయని ప్రజల నుంచి ప్రతిరోజు ఫిర్యాదులు పదుల సంఖ్యలో వస్తున్నాయని వాటిని పరిష్కరించకుండా నిర్లక్ష్య ధోరణతో అధికారులు వ్యవహరిస్తే అటువంటి వారిపై ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో ఫిర్యాదులు పంపిస్తామని ఆయన హెచ్చరించారు మండలంలో జరుగుతున్న రి సర్వే కార్యక్రమాలను సమర్థవంతంగా పనిచేయాలని అదేవిధంగా గ్రామ సర్వేలు కూడా నిబంధనలతో పనిచేయకపోతే వారిపై చర్యలు కూడా తీసుకోక తప్పదని అదేవిధంగా గ్రామ పరిధిలో అనేక రెవెన్యూ సమస్యలు ఫిర్యాదులు రూపంలో వస్తున్న పట్టించుకోవడంలేదని వాటిని పరిష్కరించకపోతే సిబ్బందిపై కఠినంగా వ్యవహరించక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దారు ప్రసాద్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురగయ్య, మండల సర్వేయర్ రెడ్డి శేఖర్ విఆర్వోలు గ్రామ సర్వేలు తదితరులు పాల్గొన్నారు.



ముదుపుల వేముల ఆర్వోలు మందలిస్తున్న తహసిల్దార్

## మానసిక ఆరోగ్యానికి నూతన దిశ, అవగాహన

**కడప, మార్చి 10 ప్రభాతవార్త :**



విద్యార్థుల మానసిక ఆరోగ్యం, కౌన్సెలింగ్ సేవలు మరియు సైకాలజికల్ పరిశోధనలను ప్రోత్సహించేందుకు కే.ఎస్.ఆర్.ఎం. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (అటోనమస్) మరియు విజయవాడకు చెందిన అంబవరం సెంటర్ ఫర్ సైకాలజికల్ రీసెర్చ్ అండ్ వెల్‌బీయింగ్ అసోసియేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు మరియు సిబ్బందికి మానసిక ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డి, ఫౌండర్ వైస్ ప్రెసిడెంట్, అంబవరం సైకాలజికల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ మాట్లాడుతూ కళాశాలలోనీ విద్యార్థుల కౌన్సెలింగ్ సేవలు, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, వ్యక్తిత్వ వికాసంపై వర్క్‌షాప్‌లు, సైకాలజికల్ అసెస్‌మెంట్‌లు, కెరీర్ గైడెన్స్ పరీక్షలు, మరియు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, ఒత్తిడిని తగ్గించడం మరియు సమగ్ర అభివృద్ధిని సాధించడం లక్ష్యంగా పెట్టుకునామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, అంబవరం సైకాలజికల్ రీసెర్చ్ సెంటర్ ఫౌండర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీ ఎన్ ప్రసాద్, ఐక్యూ ఏసి డీన్ డాక్టర్ విజయ్‌కిషోర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్స వేడుకలు



**జమ్మలమడుగు, మార్చి 10, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలోని సభాభవనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని మహిళా అధికారిణుల సమక్షంలో ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలను జరిపినట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి మరియు కార్యదర్శి ఎ.సంజీవరాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురించి, ప్రాముఖ్యత గురించి, మహిళ గొప్పతనం గురించి పలువురు వక్తలు కొనియాడారు. రోటరీ క్లబ్ ఐసీడీజీ సాధు గోపాలకృష్ణ మాట్లాడుతూ మహిళా మహిళ గొప్పతనం గురించి కొనియాడారు. మహిళా మాతృమూర్తుల గురించి ప్రసంగించారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కె.వి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధికారిణులు ఎక్సైజ్ సీఐ సరితారెడ్డి, ఎంపీడీవో సయ్యదున్నీసా, ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట సుబ్బమ్మ, మహిళా డాక్టర్లు చంద్రకళ, విజయలక్ష్మీ, శిల్పా రవి, శ్రీలత, లిఖిత, ఆశా, రోటరీ మెంబర్ చరణకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో జయమ్మ, బాలికల కళాశాల వార్డెన్ మనోరాణి, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ పెద్దలు, సభ్యులు కకుండా భాస్కర్, నాగేశ్వరరెడ్డి, సంగేశ్వరరెడ్డి, రఫీ, బాషా, ఓబులరెడ్డి, డా.రఫీక్ బాషా, డా.సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘర్షణలో మహిళకు గాయాలు

**రాజుపాళెం, మార్చి 10, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వెలవలి గ్రామంలో సోమవారం అక్కా, చెల్లెళ్లకు సంబంధించిన రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి మహిళకు గాయాలైనవి. ఈ విషయమై మంగళవారం ఎస్ఐ ప్రణయ్ కుమార్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు అక్కా, చెల్లెల్లు అయిన అమీరున్, మాబుచాన్ కుటుంబాల మధ్యన ఘర్షణ జరగడంతో ఈ ఘర్షణలో అక్క అయిన అమీరూన్ ను చెల్లెలు మాబుచాన్ ఆమె భర్త కరీంలు కలిసి కర్రతో కొట్టడంతో తలకు గాయాలైనట్లు చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రిలో ఆమె ఉన్నట్లు తెలిపారు.

## ఎన్ఎబిహెచ్ అవార్డు రావడం హర్షణీయం

**ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త**



తమ ఆసుపత్రికి ఎన్ఎబిహెచ్ అవార్డు రావడం పట్ల డాక్టర్ స్వరూప్ కుమార్ రెడ్డి తన హర్షాన్ని వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక జమ్మలమడుగు రోడ్డు లోని స్వరూప్ ఐ హాస్పిటల్ ప్రాంగణంలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ మరియు హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అఫ్లియేషన్ హాస్పిటల్ కు 3వ సారి దక్కడం పట్ల డాక్టర్ స్వరూప్ కు సంస్కృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పాల్గొన్న డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎబిహెచ్ సర్టిఫికేట్ 3 సార్లు డాక్టర్ స్వరూప్ హాస్పిటల్ కు దక్కడం ఆనందకరమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమకు 3 వ సారి ఈ అఫ్లియేషన్ రావడం ఆనందకరమన్నారు. అనంతరం ఒంటేరు, డాక్టర్ వరుణ్, డాక్టర్ స్వరూప్ బంధుమిత్రులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై.వి. ధీరజ్ రెడ్డి, రాయలసీమ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ రవి శంకర్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అంకాల్ కొండయ్య పాల్గొన్నారు.

## వ్యాక్సినేషన్ ప్రక్రియను సమీక్షించిన డిప్యూటీ డైరెక్టర్

**కలికిరి, మార్చి 10, ప్రభాతవార్త:**

కలికిరి మండలంలో కొనసాగుతున్న గొర్రెలు మరియు మేకల పీపీఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.సయ్యద్ రసూల్ సాహెబ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాత్తేగడ రైతు భరోసా కేంద్రం పరిధిలోని పాత్తేగడ గ్రామాన్ని సందర్శించిన డీడీ అక్కడ ఒక గొర్రెల కాపరితో ముఖాముఖి చర్చించారు. వ్యాక్సినేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి పశుగ్రాసం మరియు జీవాల ఆరోగ్యంపై ఆరా తీశారు. పాలెం పశువైద్యశాలను సందర్శించి అక్కడి రికార్డులను, మందుల నిల్వలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైతులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పల్లవోలు ఆర్ఎల్‌యూను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో పీపీఆర్ వ్యాక్సినేషన్ లక్ష్యాన్ని నిర్దేశిత సమయంలోగా, ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో కలికిరి ఏరియా పశువైద్యశాల అసిస్టెర్ డైరెక్టర్ డా.కె.వి.నాయుడు, పశువైద్య సహాయ సర్జన్లు డా.జగన్‌మోహన్‌రెడ్డి, డా.కీర్తి, డా.గిరినాథ్‌రెడ్డి, ఎలియాజ్, రాజ్‌కుమార్, అనిల్ ఇతర శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## కూటమి వైసిపి నాయకులపై కుట్రలు చేస్తోంది

**బద్వేల్ అర్బన్, మార్చి 10 , ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులపై కుట్రలు చేస్తుందని ఎమ్మెల్సీ డిసి గోవింద రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బద్వేల్ సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న జడ్పిటిసి వంకెల చిన్నపోల్‌రెడ్డిని ఎమ్మెల్సీ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. ఒక కేసు తర్వాత మరో కేసు నమోదు చేస్తూ పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇలాంటి వేధింపులు కొనసాగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయంగా బలహీనపరచాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు చేపడుతున్నారన్నారు. జడ్పిటిసి పోలిరెడ్డి పై నమోదైన కేసు కూడా ఇదే కుట్రలో భాగమన్నారు. భవిష్యత్తులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి అన్యాయాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటామని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం మున్సిపల్ ఛైర్మన్ రాజగోపాల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మల్లేశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర మరియు జిల్లా అనుబంధ విభాగాల నాయకులు మరియు పార్టీ సీనియర్ నాయకులు వంకల పెద్ద పోలి రెడ్డి, యద్దారెడ్డి, పుత్తా శ్రీరాములు, బిజివేముల రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎంఆర్ఎఫ్ టైర్స్ రమణారెడ్డి, రమేష్ బాబు, వెంకటసుబ్బారెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, వీరారెడ్డి, జయరాంరెడ్డి, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.



## పాఠశాలకు మొక్కను బహుకరణ

**రాయచోటి మార్చి 10 ప్రభాతవార్త**



ఎన్ఎమ్ఎమ్ఎస్ పరీక్షలో సాధించిన విజయాన్ని పురస్కరించుకొని పాఠశాలకు మొక్కను బహుకరించిన విద్యార్థి బర్నేపల్లి చందు ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని సంబేపల్లి మండలం మోటకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని చప్పిడి పద్మజ తెలిపారు. పాఠశాల అందించిన మార్గదర్శకం, సహకారం పట్ల కృతజ్ఞతాభావంతో విద్యార్థి చందు మంగళవారం ఉదయం ప్రధానోపాధ్యాయినికి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరుస్తాయని తెలిపారు. చందు భవిష్యత్తులో కూడా ఇలాంటి మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిదంబర రెడ్డి, బిఎస్ పద్మావతి, ప్రసాద్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల కోసం 42 మంది ఎంపిక

**పీలేరు మార్చి 10 ప్రభాతవార్త:**

పీలేరు పట్టణంలో జరిగిన ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాల కోసం 42 మంది విద్యార్థులు ఎంపికయ్యారని మార్గదర్శి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె. నాగార్జున రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మార్గ దర్శి డిగ్రీ కళాశాలలో మ్యాగ్నిక్ బస్ ఫౌండేషన్ సహకారంతో చెన్నైకి చెందిన వన్ పాయింట్ వన్ కంపెనీ మేనేజర్ బి. వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ఈ ప్రాంగణ ఎంపికలకు 117 మంది విద్యార్థులు వడపోత పరీక్షకు హాజరు కాగా వారిలో 42 మంది విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి ఏడాదికి రూ.3 లక్షలు వేతనం, ఇతర అలవెన్సులు అందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. చంద్రశేఖర్ నాయుడు, డైరెక్టర్లు ఎం. లోకేశ్వర రెడ్డి, ఆర్. సుధానంద రెడ్డి, పి. జనార్ధన రెడ్డి, ఎస్. చంద్ర శేఖర్, సంస్థ ప్రతినిధులు పాల్గున్నారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మునుముందు కూడా తాము నిర్వహించే ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు పొందడానికి కృషి చేయాలని కళాశాల కరస్పాండెంట్ తెలియజేశారు.



ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు